చెత్త డంపింగ్‌తో పరేషాన్..

- జీహెచ్‌ఎంసీ చెత్త ఆటల ద్వారా అక్రమంగా ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు
- చెత్తతో కలుషితమవుతున్న చెరువు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పక్కనే ఉన్న పడేసిన చెత్తలో ఉంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తరలించే వాహనాలు ఇవే...

హఫీజ్‌పేట్ : పరిసరాలు పరిశుభ్రత అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా కొంతమంది అక్రమార్కులు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్నారు. దీంతో చెరువు కలుషితం కావడమే కాకుండా స్థానిక కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని చెత్తను చెత్త ఆటలోల ద్వారా దీప్తిశ్రీనగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించాలి. అలా కాకుండా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పక్కన ఉన్న బఫర్‌జోన్ ఖాళీ ప్రదేశంలో అక్రమంగా చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి ఆ చెత్తలో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మిగిలిన చెత్తను చెరువులోకి పడేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల ఉన్న బస్తీ, కాలనీ, గేటెడ్ కమ్యూనిటి ప్రాంతాల వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. అక్రమ డంపింగ్ యార్డు చెరువుకు సంబంధించిన బఫర్ జోన్‌లోకి వస్తుంది. ఈ డంపింగ్ యార్డుపై ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతున్నారు.





కాయిదమ్మకుంట చెరువు పక్కనే చెత్త

సమస్యలు ఇవే....

- వ్యర్థాలలోని ప్లాస్టిక్‌ను వేరు చేసి చెరువు పక్కనే వదిలేస్తున్నారు.
- చెరువు పక్కనే స్క్రాప్ గోదాం అక్రమంగా ఏర్పాటు చేశారు.
- ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేసిన తరువాత చెరువులోకి పడేస్తున్నారు.
- హోటళ్ళు, ఆసుపత్రి నుంచి తీసుకు వస్తున్న వ్యర్థాలు చెరువు పక్కనే వదిలేస్తున్నారు.
- చెరువు పక్కనే వేసిన వ్యర్థాలు పశువులు మేయడంతో అనారోగ్య పాలువుతున్నాయి.
- చెత్త డంపింగ్ పక్కనే అక్రమంగా బోరు వేసి భూగర్భ జలాల దోపిడీ చేస్తున్నారు.

పరిష్కారం కోసం చేయాల్సిన పనులు ఇవే....

- చెరువు పక్కన ఉన్న అక్రమ డంపింగ్ యార్డును తొలగించాలి.
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.
- చెరువులోకి చెత్త చెదారం వేయకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- బంఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ల సూచిన బోర్డు ఏర్పాటు చేయాలి
- చెరువు చుట్టూ సుందరీకరణ పనులు అధికారులు వెంటనే చేపట్టాలి

అక్రమ చెత్త డంపింగ్ యార్డుపై చర్యలు తీసుకుంటాం..

కాయిదమ్మకుంట చెరువు సమీపంలో చెత్త డంపింగ్‌ను చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అక్రమంగా ఏర్పాటు చేసిన స్క్రాప్ గోదాంను వెంటనే తొలగించాలని నోటీసులు ఇచ్చాం. వారు డంపింగ్‌ను తొలగించకపోతే త్వరలోనే మేమే తొలగించి చర్యలు తీసుకుంటాం . అదే విధంగా చెత్త ఆటోలను కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంప్పింగ్ యార్డుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



– డా. కార్తీక్, ఏఎంహెచ్ఓ, చందానగర్ సర్కిల్ 21

బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు...

కాయిదమ్మకుంట చెరువు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలకు, గోదాలకు అనుమతి లేదు. నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. లేక్ పోలీసులతో డంపింగ్ గోదామును పరిశీలించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఖాళీగా ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్మాణాలు చేపట్టకుండా చూస్తాం.

– శేషగిరిరావు, డీఈ ఇరిగేషన్ విభాగం

అంతరిస్తున్న అడవులతో తీవ్ర ప్రభావం



ఈపీటీఆర్ఐలో శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు


ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: అంతరిస్తున్న అడవులతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఈటీపీఆర్ఐ(ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ రిసెర్చ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఈటీపీఆర్ఐలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు వారం రోజులు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల వర్గీకరణ, గుర్తింపు, పరిమాణీకరణ పద్ధతులపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జాతులను గుర్తించడం, సంరక్షించడం ముఖ్యమైన అంశమని అన్నారు. నాబార్డ్ తెలంగాణ రీజియన్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల మాట్లాడుతూ అడవులను సంరక్షించడం, జంతువుల వినాశనాన్ని నియంత్రించడం ద్వారా వాతావరణ మార్పులను నియంత్రించవచ్చని అధ్యయనాలు, సిద్ధాంతాలు వెల్లడిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డ్ డీజీఎం సోమసుందరం, సైంటిస్టులు డాక్టర్ జె.శేష శ్రీనివాస్, డాక్టర్ సునీల, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యార్థుల పెయింటింగ్



పెయింటింగ్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు



విద్యార్థులు వేసిన పేయింటింగ్స్

రాయదుర్గం: విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ ఆలోచింపచేశాయి. 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం నేపథ్యంలో గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతోపాటు గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ, ఇతర సమీపంలోని పాఠశాలలకు చెందిన 70 మంది పాల్గొన్నారు. ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం లేకుండా తాము చదువుకున్న అంశాలు, నేర్చుకున్న వాటిని పరీక్షలో అడిగిన ప్రశ్నలకు జవాబులు రాసేలా చూడడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు.

మెరిసిన రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెట్లు



అథ్లెట్లను అభినందిస్తున్న అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్, తదితరులు

మియాపూర్ : మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్ అథ్లెట్లు సత్తా చాటారని అథ్లెట్స్ మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండు పాటు జరిగిన మాస్టర్ అథ్లెట్స్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుండి 48 మంది అథ్లెట్లు పాల్గొన్నారని తెలిపారు. లాంగ్‌జంప్, హై జంప్, ట్రిబుల్ జంప్, షాట్‌పుట్, డిస్క్, జావలెన్‌త్రో, రన్నింగ్, వాకింగ్ పోటీల్లో అథ్లెట్లు తమ ప్రతిభ కనబరిచి 45 పతకాలను సాధించారన్నారు. అందులో 20 బంగారు పతకాలు, 11 వెండి పతకాలు, 14 కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. వారిని అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్, కార్యదర్శి నూనె సురేందర్‌లు అభినందించారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ప్రత్యేక శిక్షణతోనే తమకు పతకాలు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు అథ్లెట్లు పేర్కొన్నారు.

అక్రమ విద్యుత్ మీటర్లు తొలగించాలి

హఫీజ్‌పేట్ : మియాపూర్ మదీనాగూడలో అక్రమ విద్యుత్ మీటర్లను తొలగించాలని హఫీజ్‌పేట్‌లోని విద్యుత్ ఏడీఈ కార్యాలయం ముందు సామవారం స్థానిక నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటర్ ఒక చోట విద్యుత్ కనెక్షన్ మరోచోట అనే అంశంపై పోరాడుతున్నామన్నారు. కొంత మంది డొమెస్టిక్ మీటర్ కనెక్షన్ తీసుకొని కమర్షియల్‌గా వినియోగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేయడానికి ఎంతో కృషి చేస్తున్నప్పటికీ కొంత మంది విద్యుత్ వాడకంపై తప్పుదోవన పడుతుందన్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి అక్రమ మీటర్లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఏడీఈ శ్యాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

క్రైం కార్నర్..


చికిత్స పొందుతూ టీచర్ మృతి



జయశ్రీ (ఫైల్)

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ ఎస్.జయశ్రీ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. స్కూల్ ఉపాధ్యాయులు తెలిపిన మేరకు.. ఈ నెల 18న శేరిలింగంపల్లి హైస్కూల్‌లో క్లాస్ పూర్తి అయిన తరువాత మరో క్లాస్‌కు వెళ్లే క్రమంలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ జయశ్రీ కప్పకూలి పోయారు. దీంతో వెంటనే సమీపంలోని అర్చన హాస్పిటల్‌కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. కుటుంబ సభ్యులు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

బీఫార్మసీ విద్యార్థిని అదృశ్యం



రోషిణి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఫార్మసీ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ రామానాయుడు తెలిపిన మేరకు.. రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోషిణి ఈనెల 13వ తేదీన సంక్రాంతి సెలవులకు బాబాయి ఇంటికి చెముడులంకకు వెళ్లింది. తిరిగి 16వ తేదీన కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి బయలుదేరింది. 22వ తేదీన టాంజానియాలో ఉన్న తండ్రి రాముకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు కళాశాలకు ఫోన్ చేయగా 22వ తేదీ వరకు సెలవులు ఉన్నాయని చెప్పారు. తండ్రి రాము కూతురుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: టీఎన్‌జీఓకాలనీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీఎన్‌జీఓకాలనీ, ఫేజ్-1, ఫేజ్-2 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

- టీఎన్‌జీఓకాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెక్రెటేరియట్ కాలనీ, టీఎన్‌జీఓకాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

శ్రీ మన్మహాభారత సప్తాహ జ్ఞానయజ్ఞం ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో 3వ శ్రీ మన్మహాభారత సప్తాహ జ్ఞానయజ్ఞం సోమవారం రాత్రి ప్రారంభమైంది. జ్ఞానయజ్ఞంలో భాగంగా అంకురారోపణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు ఎస్.రామాచార్యులు తెలిపారు.

సైక్లింగ్‌పై చిన్నారులకు అవగాహన

గచ్చిబౌలి: ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'బై సైకిల్ బస్' భావనను పెంపొందించేందుకు చిన్నారులకు సైక్లింగ్ నిర్వహించారు. మాదాపూర్‌లోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ విద్యార్థులతో కలిసి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి సైక్లింగ్ చేశారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో బైసైకిల్ బస్‌కు అవకాశం కల్పిస్తే పర్యావరణానికి మేలు జరుగుతందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులంతా కలిసి తొక్కితో బైసైకిల్ బస్‌లో ఎంచక్కా చక్కర్లు కొట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ హైట్స్ ప్రిన్సిపల్ నిషా, మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్యాలెంట్‌స్ప్రింట్-ఐఐఎస్‌సీ నూతన కోర్సుకు శ్రీకారం

రాయదుర్గం: నెక్స్ట్ జనరేషన్ సెమీ కండక్టర్ నిపుణులకు మరిన్ని నైపుణ్యాలను అందించేందుకు నూతన కోర్సును రూపొందించారు. గచ్చిబౌలిలోని ట్యాలెంట్‌స్ప్రింట్- బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) కలిసి మైక్రో, నానో ఎలక్ట్రానిక్స్‌లో పీజీ స్థాయి అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రకటించాయి. అనేక పరిశ్రమలు, అప్లికేషన్‌లలో సెమీకండక్టర్ బాగాలకు పెరుగుతున్న డిమాండ్ పరంగా భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఆటోమోటివ్, డేటాస్టోరేజీ, వైర్‌లెస్ పరిశ్రమల ద్వారా నడిచే సెమీకండక్టర్ మార్కెట్‌లో రాబోయే పదేళ్ళలో 70 శాతం వృద్ధి కనిపిస్తోంది. సెమీకండక్టర్ మార్కెట్ 2030 నాటికి ట్రిలియన్ డాలర్ల పరిశ్రమగా వృద్ధి చెందుతుందని అంచా వేశారు. ఈ నేపథ్యంలో ఈ కోర్సుకు మంచి ఆదరణ ఉంటుందని రూపొందించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గృహకల్పలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం, దేవాలయ మండల పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు వీరేశంగౌడ్, వెంకట్‌కుమార్, వీరేష్, వీరయ్య, శ్రీను, సుమన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కాస్ట్యూమ్స్‌కు విరాళం



పటాన్‌చెరు టౌన్: దేవి శ్రీ చైతన్య లహరి కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్ అకాడమి ఇస్నాపూర్‌లో విద్యార్థినుల కాస్ట్యూమ్స్‌కు రూ. లక్ష విరాళాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ సూచన మేరకు ఎన్ఎమ్ఆర్ యువసేన సభ్యులు అందజేశారు. కల్లూరి ముత్యాలు, పటేల్, నాగేంద్ర బాబు, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ కేలెండర్, డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రాయదుర్గం: నూతన కేలెండర్, డైరీని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడిగాంధీ ఆవిష్కరించారు. సోమవారం ఆయన నివాసంలో రాయదుర్గం విద్యాభివృద్ధి సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలెండర్, డైరీలను ఆయన మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ద్వారా విద్యాభివృద్ధికి, విద్యాసంస్థల పురోభివృద్ధికి చేస్తున్న కృషిని ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి సురేష్, ప్రతినిధులు నరేందర్‌ముదిరాజ్, వెంకటేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



మసీద్‌బండ జడ్పీహెచ్ఎస్‌లో డ్రాయింగ్ పోటీలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో దేశమంతటా పాఠశాలలో పరీక్షా పే చర్చలో భాగంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవి కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండ జడ్పీహెచ్ఎస్‌లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 9,10 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలితీసేందుకు పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. అంతే కాకుండా ఒత్తిడి తగ్గించేందుకు వీలుంటుందన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో చిట్కాలను పంచుకునేలా, ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయడం, పరీక్షలను పండుగలా జరుపుకోవాలని ప్రధాన మంత్రి పిలుపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి, నాయకులు సదానంద్ యాదవ్, ఎల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై పెట్రోలింగ్



ఇందిరానగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీ

గచ్చిబౌలి: సంక్రాంతి సెలవుల నుంచి మాదాపూర్ జోన్‌లో పోలీసులు వినూత్న రీతిలో సైక్లింగ్ చేస్తూ పెట్రోలింగ్ చేయడం అందరినీ ఆకర్షిస్తోంది. ఆదివారం రాత్రి హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ సభ్యులతో కలిసి పలు ప్రాంతాలలో సైక్లింగ్ చేస్తూ మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీ వినాయక్‌నగర్, బొటానికల్ గార్డెన్, మసీద్‌బండలో పెట్రోలింగ్‌లో పాల్గొన్నారు. ఉమెన్స్ హస్టళ్లలో ఉంటున్న ఐటీ ఉద్యోగినులకు ఎలాంటి రక్షణ చర్యలు చేపడుతున్నారని ఆరా తీశారు. మహిళలతో మాట్లాడి రక్షణపై పలు సూచనలు చేశారు. శ్రీరాంనగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడిన ఆమె ముందస్తు నేర నివారణ చర్యలపై జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి సీఐ గోనె సురేష్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, ఉమేష్, శేఖర్, పరమేష్, వెంకటేశ్వరరావు, కాశినాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్‌లోని జనప్రియ నగర్‌లో కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవ అవయవాలలో అతి ప్రధాన అవయవం కన్ను అని పేర్కొన్నారు. కంటి వెలుగు ద్వారా పేద ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ళద్దాలు ఇస్తున్నారన్నారు. కంటి వెలుగు పథకం దేశంలోనే గొప్ప పథకమని, దేశానికే ఆదర్శవంతమైన పథకమన్నారు. శిబిరాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 100 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలందరికీ వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, కనకమామడి వెంకటేష్ గౌడ్, శేఖర్, బాబుమోహన్ మల్లేష్, జనార్ధన్, ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



నల్లగండ్లలో నేతాజీకి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల ప్రాథమిక పాఠశాలలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణలోని నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కృషి ఎనలేనిదని కొనియాడారు. నేతాజీ బాటలో నేటి యువత నడవాలని సూచించారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, వి.గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి విరాళం



దేవాలయ నిర్వాహకులకు నగదును అందజేస్తున్న ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు

పటాన్‌చెరుటౌన్: చిట్కుల్ గ్రామంలో సనా ఫేజ్-1 కాలనీలో ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి రూ.2లక్షలు, ఫేజ్ -2 ఎల్లమ్మ దేవాలయానికి రూ.2లక్షల చొప్పున బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ గ్రామ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ సహకారంతో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ముత్యాలు అందజేశారు. కార్యక్రమంలో సాయిలు గౌడ్, సునీల్, మిశ్రా, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, హరినాథ్, శివా రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి చర్యలు



యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని కాలనీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులకు సోమవారం రోజారాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు. కౌన్సిలర్ బీరప్ప, స్థానిక నాయకులు విఠల్‌చారి తదితరులు పాల్గొన్నారు.